క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదు చేసి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా సౌకర్యార్థం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మూడు రెవెన్యూ డివిజన్లలో 22 మండల కేంద్రాలు, నాలుగు మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఆయా స్థాయిల్లో తమ సమస్యలను విన్నవించవచ్చని తెలిపారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చునన్నారు.

వైభవంగా కోటి హనుమాన్ చాలీసా పారాయణ



అమలాపురంలో కోటి హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలోని పురాతన సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సనాతన ధర్మ వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటి హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని సామూహికంగా పారాయణ చేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. బాల భక్త సమాజం సభ్యులు భక్తులకు సేవలందించారు.

అగ్నిప్రమాద బాధితులకు కుడుపూడి ఆర్థిక సహాయం

తాళ్లరేవు: చినవలసలలో అగ్నిప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన బాధితులకు పి.మల్లవరం మాజీ సర్పంచ్, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.5 వేల ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి 50 కిలోల బియ్యం, నెలకు సరిపడా కిరాణా సరుకులు అందజేసారు. గృహ నిర్మాణానికి రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. తాళ్లరేవు బైపాస్ రహదారిలోని సూర్య హాస్పిటల్ అధినేత మచ్చా గంగాధర్, యానాంకు చెందిన మల్లాడి శామ్యూల్ బాధితులకు ఆర్థిక సహాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లాడి వరదరాజు, కడలి శ్రీను, పెస్సింగి భాగ్యరాజు, నాగూరు, నాగబాబు పాల్గొన్నారు.

మందార కాలువ గట్ల అభివృద్ధిపై వినతి

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పరిధిలో ప్రధాన ఊటకాలువ మందార కాలువ గట్లను అభివృద్ధి చేసి వంతెన నిర్మించాలని ఆ ప్రాంత రైతులు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు మొరపెట్టుకున్నారు. ఆదివారం మండలంలో రేషన్ దుకాణాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే సుబ్బరాజును ఆక్వా రైతులు కలసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నీలపల్లి నీటి సంఘం అధ్యక్షుడు ధూళిపూడి గోపి ఆధ్వర్యంలో రైతులు పోతుల చినబాబు, పోశింశెట్టి లోవ, రాజు తదితరులు మాట్లాడుతూ ఏటిగట్టు ఛిద్రం కావడంతో చెరువులు వద్దకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని తెలిపారు. ఆకాశపు వారి పుంత నుంచి పుప్పాల విష్ణుమూర్తి చెరువుల మధ్య వంతెన నిర్మిస్తే తమకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సుబ్బరాజు స్పందించి స్వయంగా వచ్చి సమస్యను పరిశీలించి రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బ్రాహ్మణుల సేవలను గౌరవించాలి



బ్రాహ్మణ దినోత్సవ సభలో మాట్లాడుతున్న లక్ష్మీ నరసింహం

అమలాపురం టౌన్: చాణక్యుని జన్మదినం సందర్భంగా ఏటా జూన్ 1న నిర్వహించే ప్రపంచ బ్రాహ్మణ దినోత్సవాన్ని స్థానిక భూపయ్య అగ్రహారంలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆదివారం ఘనంగా నిర్వహించింది. అంతర్జాతీయ వాకర్స్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర మాట్లాడుతూ బ్రాహ్మణుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవలను అందరూ గుర్తించి, గౌరవించాలని సూచించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన బ్రాహ్మణ దినోత్సవంలో అంతర్జాతీయ వాకర్స్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, బ్రాహ్మణ ప్రతినిధులు పేరి లక్ష్మీ నరసింహం, పుత్సా కృష్ణ కామేశ్వర్ మాట్లాడుతూ పలు అంశాలు వివరించారు. పేరి లలిత తన గానంతో అలరించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు భమిడిపాటి నరసింహశాస్త్రి, నూకల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు

- అమలాపురంలో హడావుడిగా నూతన 'మార్గ్' నిర్మాణానికి శ్రీకారం
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలంటూ కూటమి నేతల ప్రచారం
- మరో క్రాస్ బండ్ నిర్మాణంపై దృష్టి సారించని వైనం



అమలాపురంలో ఇప్పటికే సగం పూర్తయిన విశ్వరూప్ మార్గ్



అమలాపురంలో ఆనంద్ మార్గ్ నిర్మాణం చేపట్టనున్న ప్రాంతం

అమలాపురం టౌన్: పట్టణం పరిధిలో ఈదరపల్లి వద్ద రెండో వంతెన నిర్మాణం, పాత వంతెనపై వాహనాల రాకపోకల నిలిపివేతతో ప్రయాణికులు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల ట్రాఫిక్ సమస్యలు మరింత జటిలమయ్యాయి.

ట్రాఫిక్ సమస్య నివారణపై చిత్తశుద్ధి కరువు

ఈదరపల్లి వంతెన నిర్మాణ నేపథ్యంలో, పాత వంతెనపై వాహనాల రాకపోకలు నిలిపివేసిన క్రమంలో ట్రాఫిక్ మళ్లింపునకు పోలీస్ శాఖ మూడు రకాల విధానాలతో ముందుకు సాగింది. అయితే ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఈదరపల్లి వంతెనకు ఓ వైపు అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో పంట కాలువపై ఓ క్రాస్ బండ్ వేసి దాని ద్వారా పట్టణంలోకి ప్రవేశించే వెసులబాటు కల్పించింది. వంతెనకు ఇవతల (ఈదరపల్లి, ఇందుపల్లి గ్రామాల వైపు) పంట కాలువపై మరో క్రాస్ బండ్ నిర్మించి ఉంటే ట్రాఫిక్ సమస్యలు ఇట్టే పరిష్కారమయ్యేది. ట్రాఫిక్ సమస్య నివారణపై అధికారులకు చిత్తశుద్ధి కరువైందని పలువురు విమర్శిస్తున్నారు.

విశ్వరూప్ మార్గ్‌ను పూర్తి చేస్తే కొంతవరకూ ఉపశమనం

గత ప్రభుత్వంలో చిన్న వంతెనల నుంచి కుమ్మరి కాలువ (డ్రెయిన్) పక్క నుంచి మున్సిపల్ కాలనీ ఏటిగట్టు మీదుగా బైపాస్ రోడ్డుకు కలిసేలా విశ్వరూప్ మార్గ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మార్గంలో 50 శాతం పనులు గత ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. మధ్యలో కల్వర్టుల నిర్మాణం పూర్తయ్యింది. శ్మశానవాటిక పక్క నుంచి బైపాస్‌ను కలుపుతూ పక్కా రోడ్డు నిర్మిస్తే ఈ విశ్వరూప్ మార్గ్ నూరు శాతం నిర్మాణం పూర్తవుతుంది. ఈదరపల్లి వంతెన నిర్మాణ సమయంలో అనివార్యమైన ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారానికి ఈ మార్గ్ నిర్మాణం పూర్తయితే కొంత వెసులబాటు కలిగేది. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఈ మార్గ్‌ను పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని ప్రకటించారు. ఇప్పటికే మున్సిపల్ కౌన్సిలర్లతో ఈ మార్గం నిర్మాణంపై ఎమ్మెల్యేతో చర్చించారు.

ఆనంద్ మార్గ్ పేరుతో మరో రోడ్డు నిర్మాణం

చిన్న వంతెనలకు ఇవతల అంటే కుమ్మరి కాలువ సీతాపతిరావుపేట ఏటిగట్టు మీదుగా బైపాస్ రోడ్డును కలుపుతూ ఎమ్మెల్యే ఆనందరావు మరో మార్గానికి శ్రీకారం చుట్టారు. దీనికి ఆనంద్ మార్గ్ అని పేరు పెట్టి టీడీపీ నేతలు అదేదో కొత్త మార్గాన్ని తామే కనిపెట్టినట్లుగా, ఈదరపల్లి వంతెన నిర్మాణ సమయంలో ఇది మరింత దగ్గర దారి అవుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో కొంత మేర సీతాపతిరావు పేట ఏటిగట్టు రోడ్డు కలిసి వచ్చినా మిగిలిన మట్టి మార్గాన్ని గ్రావెల్‌తో రోడ్డు నిర్మించే పనులు మొదలయ్యాయి. పట్టణంలోకి వాహనాలు సులభంగా దగ్గర తోవలో వచ్చేందుకు విశ్వరూప్ మార్గ్, ఆనంద్ మార్గ్‌లు అక్కరకు వస్తాయి. అయితే ఈ చర్యలు ఎప్పుడో చేపట్టాల్సి ఉందని స్థానికులు అంటున్నారు.

రెండు రోడ్లను వేగవంతంగా పూర్తి చేయాలి

ఈదరపల్లి వంతెన నిర్మాణపరంగా ఎదురైన ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కోసం ఆ వంతెనకు అవతలి వైపు పంట కాలువపై మరో క్రాస్ బండ్ వేస్తే సరిపోయేది. అయితే అత్యవసరంగా ట్రాఫిక్ సమస్యకు పరిష్కార మార్గమంటూ హడావుడిగా ఆ రెండు మార్గాలను నిర్మించడం ఈ కీలక సమయంలో సరైన నిర్ణయం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఆ మార్గానికి టీడీపీ నేతలు ఆనంద్ మార్గ్ అని పేరు పెట్టి ఎమ్మెల్యే ఆనందరావును ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆనంద్ మార్గ్‌ను నిర్మిస్తున్నంత వేగంగానే విశ్వరూప్ మార్గ్‌ను కూడా పూర్తి చేయాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈపాటికే విశ్వరూప్ మార్గ్‌ను అందుబాటులోకి తెచ్చి ఉంటే ఈదరపల్లి వంతెన నిర్మాణ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగి ఉండేవని ప్రయాణికులు అంటున్నారు. ఆనంద్ మార్గ్‌తో పాటు విశ్వరూప్ మార్గ్‌ను కూడా సమాంతరంగా అభివృద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వెన్నుపోటు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య



గొల్లవిల్లిలో పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ శ్రీకాంత్

ఉప్పలగుప్తం: వెన్నుపోటు రాజకీయం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అమలాపురం నియోజకవర్గ అసెంబ్లీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన శ్రీకాంత్, మండల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తన మామ నందమూరి తారక రామారావుకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారం చేపట్టారని ఆయన విమర్శించారు. ప్రతి ఎన్నికలో హామీలిస్తూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని అమలు చేయకుండా వెన్నుపోటు పొడవటం చంద్రబాబుకు అలవాటేనని పినిపే శ్రీకాంత్ అన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడంతో జూన్ 4న అధినాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినంగా ప్రకటించామన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల కార్యకర్తలంతా పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గ, కడిమి చిన్నమరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, ఆయా విభాగాల మండల అధ్యక్షులు, పోతుమూడి కొండబాబు, యనమదల పల్లంరాజు, ఓగూరి విజయ్‌కుమార్, కోటుం లోవరాజు, పార్టీ నాయకులు దంగేటి దొరబాబు, చీకట్ల కిషోర్, లంకే సూరిబాబు, మోటూరి సత్యంకాపు, నిమ్మకాయల హనుమంతు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుకొండలు సేవలు ప్రశంసనీయం



తాళ్లరేవు ప్రజా సంఘాల భవనంలో ఏడుకొండలు దంపతులను సత్కరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు, ఉగాది నంది పురస్కార అవార్డు గ్రహీత వడ్డి ఏడుకొండలు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏడుకొండలు దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడుతూ దళిత సమస్యలపై అనేక పోరాటాలు చేయడంతో పాటు సేవా కార్యక్రమాలు చేస్తూ అనేక అవార్డులు పొందిన ఏడుకొండలను అభినందించారు. ఈ కార్యక్రమంలో దున్నా జనార్ధనరావు, అత్తిలి బాబూరావు, టేకుమూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లోకి వ్యర్థాల విడుదలపై రైతుల ఆందోళన



లంక కాలువలో పేరుకుపోయిన సిల్ట్

యానాం: కనకాలపేటలో రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకులో నీటిని శుద్ధి చేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను లంక కాలువలోకి వదిలివేయడం వల్ల పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమస్యను అధికారులు పరిష్కరించాలని ఆదివారం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లంక కాలువలో సుమారు అయిదు అడుగులమేర సిల్ట్ పేరుకుపోయిందని దీంతో లంక భూములను ఆనుకుని ఉన్న కాలువలు పూడుకుపోయాయని తెలిపారు. దీంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారన్నారు. కలుషిత నీటికి పశువులు తాగడంవల్ల అవి వ్యాధుల బారిన పడుతున్నాయని పాడి రైతులు అన్నారు. తక్షణం అధికారులు స్పందించి వాటర్ ట్యాంకులోని వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేక పైపులైను వేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కవల తిరుమలరావు, కోన సత్తియ్య తదితరులు పాల్గొన్నారు.

బాలాజీని దర్శించుకున్న ఎస్పీ



ఎస్పీ కృష్ణారావుకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారిని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన ఎస్పీకి ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం శ్రీ, భూ సమేతంగా కొలువైన బాలబాలాజీని ఎస్పీ దర్శించుకున్నారు. ఎస్పీ పేరిట అర్చకులు పూజలు జరిపించారు. అర్చకుల నుంచి ఎస్పీ వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తి స్వామి వారి చిత్రపటం, పట్టు వస్త్రాలు, శేష వస్త్రం, ప్రసాదాలను ఎస్పీకి అందజేశారు. ఆయన వెంట నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రహదారి భద్రతపై బాధ్యతగా వ్యవహరించాలి

అమలాపురం రూరల్: రహదారి భద్రతా నియమాలు పాటించని విద్యార్థులు నడిపిన మోటారు బైకులపై నమోదు చేసిన కేసుల్లో విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్టీఓ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. రహదారి భద్రత విషయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డీటీవో ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్ పిల్లలకు మోటార్ బైక్‌లు సునాయాసంగా ఇచ్చేస్తున్నారని, తనిఖీ సమయాల్లో ఇకపై మైనర్లు పట్టుపడితే తండ్రిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని డీటీఓ హెచ్చరించారు. కళాశాలలు తెరిచేనాటికి 18 ఏళ్లు నిండిన విద్యార్థులు తప్పనిసరిగా లెర్నర్ లైసెన్స్‌లు పొందాలని విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత విషయంలో ఉపేక్షించేది లేదని కఠినంగానే వ్యవహరిస్తామని డీటీవో తెలియజేశారు. రహదారి భద్రత విషయంలో ప్రిన్సిపాళ్ల, తల్లిదండ్రుల పాత్ర ఎంతో బాధ్యతాయుతమైనదని ఆయన పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పటవల హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



బలుసుతిప్ప ప్రాథమిక పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

- మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ సందడి
- మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తాళ్లరేవు: ఉద్యోగ, వ్యాపార రీత్యా వారంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. బాల్య స్నేహితులను చూసి మధుర స్మృతులను నెమరువేసుకోవాలన్న ఆకాంక్షతో వారంతా తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. నెలరోజుల లోపులోనే ఎక్కడెక్కడ ఉన్నవారందరినీ ఒక చోటకు చేర్చి ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. పటవల శ్రీమతి, శ్రీ పోలిశెట్టి వీరాంజనేయులు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1992–93లో టెన్త్ పూర్తిచేసిన విద్యార్థులందరూ సుమారు 32 ఏళ్ల అనంతరం ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. స్నేహితుల యోగ క్షేమాలను తెలుసుకుని, పిల్లలు ఎంతమంది, ఏం చదువుతున్నారు అంటూ ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆట పాటలతో సందడి చేసి ఆనందంగా గడిపారు. తోటి స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేసారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు డీకే రామానుజాచార్యులు, మందాల వీరభద్రరావును ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చిన్ననాటి మిత్రులందరూ ఇలా కలుసుకుని ఆనందంగా గడపడంతోపాటు పేద కుటుంబానికి చెందిన తమ స్నేహితుడు మృతి చెందాడని తెలిసి అతని కుటుంబానికి సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ చాలా ఏళ్ల తరువాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం మధురానుభూతిని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సలాది వెంకట నారాయణ, యాళ్ల సూర్యభాస్కరరావు, గండి రాంబాబు, కోట అమర్‌కుమార్, డేగల లక్ష్మి, కపిలేశ్వరపు శివ, దోనం అప్పారావు, మైదు హరిబాబు, దేవరకొండ కృష్ణ, గుత్తాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కాట్రేనికోన: మండలంలో బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్ప ఎంపీపీ పాఠశాలలో 1990–95లో ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థి, సర్పంచి మల్లాడి ఏడుకొండలు అధ్యక్షతన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. సుమారు 35 ఏళ్ల తరువాత 40 మంది పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమై బాల్యంలోని మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యనభ్యసించిన పాఠశాలలో గత అనుభవాలను, తరగతి గదులను చూసుకుని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వీరమల్ల నాగేశ్వరరావు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ సర్పంచి సంగాని వీర్రాజు, పెమ్మాడి రాముడు, పూర్వ విద్యార్థులు సంగాని చిన్ని, తిరుమాని వీరబాబు, బద్రే రాంబాబు, తిరుమాని గోవిందు, మోకా సత్తిబాబు, ఓలేటి రామాంజనేయులు, దామ సత్యానందం, ఓలేటి శ్రీను, కోరుమిల్లి ప్రసాద్, పొన్నాడ సతీష్ తదితరులు ఉన్నారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ

మామిడికుదురు: దోమల నిర్మూలతోనే మలేరియా నివారణ సాధ్యమవుతుందని సీహెచ్ఓ సత్యవతి తెలిపారు. మలేరియా నివారణా మాసోత్సవంలో భాగంగా ఆదివారం నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ×మలేరియా అంతం మనతోనే¤ అనే నినాదంతో ఈ ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తద్వారా మలేరియా నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఏడుకొండలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనసీమలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి

కొత్తపేట: కోనసీమలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంక్షేమ సంఘం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు సంఘం అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు కోనసీమలో చట్టసభల ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. ఆ నకళ్లను ఆదివారం కొత్తపేటలో విలేకరులకు విడుదల చేశారు. కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని, 50 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్ మంజూరు చేయాలని, ప్రమాద బీమా పాలసీలు ఏర్పాటు చేయాలని కోరారు.

బాలబాలికలకు బహుమతులు

అయినవిల్లి: చిత్రలేఖనంలో ఉత్తమ ప్రతిభ చూపిన 30 మంది బాల బాలికలకు ఆదివారం ధ్రువపత్రాలు, బహుమతులు అందించారు. వ్యక్తిత్వ వికాసంలో భాగంగా నేదునూరు రావి ఫౌండేషన్ వద్ద గత నెల 15వ తేదీ నుంచి 50 మంది బాల, బాలికలకు చిత్రలేఖనం తరగతులు నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలి



వుంగరాల సంతోష్‌ను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన వుంగరాల సంతోష్ ఆదివారం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను కలసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పొన్నాడను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం పొన్నాడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజల గొంతుకై వారి సమస్యల పరిష్కారానికి పోరాడాలని పొన్నాడ అన్నారు. ప్రతి సమస్యపై అవగాహనతో మాత్రమే మాట్లాడుతూ ప్రతిపక్షాలను ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతమయ్యే విధంగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

రోగులకు పండ్లు పంపిణీ



తాళ్లరేవు సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న గోవిందకుమార్, జగదీశ్వరరావు

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు దడాల జగదీశ్వరరావు మాతృమూర్తి వెంకాయమ్మ ఐదవ వర్ధంతి సందర్భంగా ఆదివారం సుమారు వంద మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసారు. స్థానిక సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, పార్టీ నాయకులు ఆకుల వెంకటేశ్వర్లు, కొపనాతి నాగరాజు, రేవు నాగేశ్వరరావు, చిట్టూరి చలపతి, కొల్లు శ్రీను, సంగాడి శ్రీను, మాసా శ్రీను, నీలపాల శ్రీను, రేకాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత

అమలాపురం రూరల్: పొలగుమ్మిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు ఇన్వర్టర్, బ్యాటరీని ఆదివారం బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు గుంట్రు వెంకటేశ్వరరావుకు వారు ఇన్వర్టర్‌ను అందించారు. పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.

ప్రశాంతంగా నర్సింగ్ ఉద్యోగ పరీక్ష

యానాం: జిప్‌మెర్ ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 43 నర్సింగ్ పోస్టుల నియామకానికి ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక రీజెన్సీ హైస్కూల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 378 మంది హాజరయ్యారు. ఉదయం 8.30 గంటలకు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం 10 గంటల తర్వాత పరీక్ష ప్రారంభించారు. ఈ పోస్టులకు సంబంధించి ఫలితాల వెల్లడి, ఇంటర్వ్యూ తేదీలను త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

వైభవంగా నూకాలమ్మ, రావులమ్మ తీర్థం



పిల్లంక గ్రామదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పిల్లంక గ్రామదేవతలు నూకాలమ్మ, రావులమ్మ అమ్మవార్ల జాతరలో భాగంగా ఆదివారం తీర్థం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డిపోలో రేషన్ సరకుల పంపిణీని ప్రారంభించిన కలెక్టర్



అమలాపురంలో రేషన్ డిపో వద్ద సరకులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్: పట్టణంలోని రెండో వార్డులో రేషన్ డిపోను కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం ఉదయం ప్రారంభించారు. రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. డిపో సమీపంలోని వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాణి సంయుక్త, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.